# రాగింగ్

మురళికి చెప్పలేనంత ఆనందంగా వుంది- ఇంజనీరింగ్ కాలేజిలో చేరినందుకే ఆ ఆనందమంతా.

ఫీజు కట్టేవరకూ కాలేజిలో చేరతాడనే నమ్మకమే లేదు తనకు. ఇంటి పరిస్థితులలా వున్నాయి మరి. 'డబ్బు దొరకలేదని' తన నాన్న ఎక్కడంటాడోనని ఒకటే భయంగా వుండేది తనకి మొన్నటి వరకు 'డబ్బులేని నాన్న ఏంనాన్న'.... అని తిట్టుకున్నాడు ఎన్నోసార్లు. ఏ ధనవంతుల కడుపులోనో పుట్టకూడదూ తను....!

ఎలాగో మురళీ నాన్న అప్పుచేసి డబ్బు తెచ్చాడు.... ఇప్పుడు మాత్రం మురళికి నాళ్ళ నాన్నపై ఎంతో కృతజ్ఞతవుంది- తన ఆశలూ, ఆశయాలు నెరవేరడానికి సాయపడినందుకు.

క్లాసుకు వెళ్ళడానికి తయారయి హాస్టల్నించి బయటికొచ్చి కాలేజి వేపు నడిచాడు.

అందమైన రాతి కట్టడంతో హుందాగా వుంది కాలేజీ భవనం. దానిమీద కిరీటం లాంటి గోపుర గడియారం-కాలేజీ వెనకాల లేబరేటరీలు, వర్కుషాపులూ, వాటికి ఓ పక్కగా వాటర్ టాంకూ....టాంకు కింది భాగాన కాంటినూ-కాలేజీ చుట్టూ వున్న దారి పొడుగునా వేప చెట్లూ, ఎకరాల కొలది పచ్చిక మైదానం, కాలేజీకి ఎడం వేపున పాలిటెక్నిక్ కాలేజీ, కుడి వేపున

కాలేజి హాస్టల్లూ.... టౌనుకు చాలా దూరంగా వుండడంవల్ల వీస్తోన్న ప్రశాంతమైన గాలి-వీటన్నిటినీ చూస్తోంటే ఎంతో ఆహ్లాదంగా వుంది మురళికి, ఏదో చెప్పరాని గొప్ప అనుభూతి.

"ఏయ్! మిస్టర్." అన్న పిలుపువిని తిరిగి చూశాడు అటుపక్కగా. కొద్ది దూరంలో వేపచెట్టు కింద ఐదుగురు స్టూడెంట్సున్నారు. వాళ్ళ వయస్సు 23, 25 మధ్యగా వుండవచ్చు. అందరూ హిప్పీల్లా జుట్లు పెంచు కుని వున్నారు.

"ఇలారా" అన్నాడు వాళ్ళలో కళ్ళజోడు పెట్టుకున్నతను. అతను పెట్టుకున్నవి సైట్ గ్లాసెస్ కాదని, స్టైయిల్ కోసమేనని అతని కళ్ళజోడు ఫ్రేమ్ చూస్తూనే తెలుస్తోంది. మనిషి మంచి దృఢంగా వున్నాడు. నీలం బెల్ పేంటూ, తెలుపు చొక్కా వేసుకున్నాడు.

మురళి దగ్గర కొస్తున్నట్టుగానే కళ్ళజోడబ్బాయి తక్కిన స్టూడెంట్స్ తో గుస గుసల్లో ఏదో చెప్పాడు- అందరూ గట్టిగా నవ్వారు.

దగ్గరగా వెళ్ళి "ఏమండీ!" అనడిగాడు మురళి.

"అండీ ఏమిటీ? మర్యాద తెలీదూ 'రెస్పెక్టెడ్ సార్' అనాలి" అన్నాడు ఎరుపు చారలచొక్కా విద్యార్థి. అతను పొట్టీకాదూ, మరీ పొడుగరి కాదు.... ఆ ఎరుపుచారల చొక్కామీద ఎంత అభిమానమోకానీ- సాధారణంగా ఆ చొక్కాని నెలలో 15 రోజులు విడవకుండా వేసుకుంటాడు. ఆ చొక్కా వేసుకున్నాడంటే బూడిదరంగు పేంటు వేసి తీరుతాడని గుడ్డిగా చెప్పొచ్చు.

"పల్లెటూరి మొద్దులా వున్నాడ్రా" చిలక ముక్కతను. ఆ ముక్కుకు ఎరుపు రంగేస్తే అచ్చం చిలకముక్కే. వారంరోజులు లంఖనాలున్న మనిషిలా ఉంటాడు.

"ఆ జుట్టు చూడు- ఏ కాలం నాటిది నాయనా ఆ కటింగూ? 1969 నాటిదా?"

వాళ్ళంతా తనని రాగింగ్ చేస్తున్నట్టు గ్రహించేడు మురళి. ఇంజినీరింగ్ కాలేజీలో కొత్తగా చేరిన ఏ విద్యార్థయినా 'రాగింగ్' నించి తప్పించుకోలేడన్న సంగతి మురళికి తెలుసు. అయినా.... తనని పల్లెటూరి మొద్దని, తన జుట్టునీ పేర్లు పెడుతోంటే కోపమొచ్చింది మురళికి- చురచుర చూశాడు.

"కోపమొచ్చిందిరోయ్!.... చూడూ నీపేరేంటీ?" చారల చొక్కా అడిగింది.

"మురళి"

"మురళిగారూ.... ఏవూరు మనది?" అంటూ మీసాలబ్బాయి సంభాషణ కొనసాగించేడు. మీసాలబ్బాయి మీసాలు పెదవులు దాటి రెండంగులాలు కిందకు దిగజారాయి. అతని మొహం చూడంగానే ముందు కనిపించేది అతని మీసాలే. మనిషి మంచి పొడుగరి ఎప్పుడూ ఒకటే రంగు దుస్తులు వేస్తుంటాడు.

"కళ్యాణ దుర్గం." జవాబిచ్చాడు మురళి.

"ఏమిటీ, మర్యాద లేకుండా ఆన్సర్లివ్వడం.... చివర్లో 'సార్' అనలేవా?"

"ఎందుకనాలి, మీరు మర్యాదగా మాట్టాడితే నేనూ మర్యాదగా మాటాడుతా"

"యూ ఫూల్.... ఎవరనుకుంటున్నావ్ మమ్మల్ని.... నీ కంటే నాలుగేళ్ళు సీనియర్స్ మేము తెల్సా?" ఎర్రచారల చొక్కా.

"పాపం, ఆ కుర్రాడితో ఏమిట్రా మీ పెదవ్వాగుడు. వదిలెయ్యండి... పన్లేకపోతేసరి మీకు" ఛీదరించుకున్నాడు అంతవరకు ఊరికే నిలబడి చూస్తూవున్న నల్లటబ్బాయి.

"ఒరే పద్మా, నువ్వూరు కుంటావా? అసలు- నువ్వు చేతకాని పెదవ్వని మాకందరికీ తెలుసు. అది మళ్ళీ ఎందుకు రుజువు చేసుకుంటావు?" అన్నాడు ఎర్రచారల చొక్కా.

పద్మా అసలు పేరు పద్మనాభం.

పద్మనాభం 'రాగింగ్' చేయడం మొదట్నించి యిష్టంలేనివాడు మాత్రం కాదు. మూడేళ్ళు వరసగా కాలేజీలో కొత్తగా చేరిన వాళ్ళని బాగా 'రాగ్' చేసి ఏడ్పించాడు. ఐతే.... గత సంవత్సరం తను రాగింగ్ చేయడం ద్వారా ఓ అబ్బాయి చదువు మానేసి వెళ్ళిపోయాడు. అప్పుడు తెలిసింది తను చేస్తున్నది ఎంత తప్పో. చాలా పశ్చాత్తాప పడ్డాడు. కొద్దికాలం కిందటే టౌన్‌లో పరిచయమైన ఓ మిత్రుడు 'రాగింగ్ టాపిక్' మీద మాట్లాడుతూ తెలియజేశాడు-

"రాగింగ్ సామ్రాజ్యవాదసంస్కృతికి ప్రతీక" అని....

"మరి 'రాగింగ్'ని మాన్పడానికి ప్రభుత్వం చర్య తీసుకోవచ్చు కదా?" అని పద్మనాభం అడిగితే- అందుకా మిత్రుడు....

"విద్యార్థుల్లో 'రాగింగ్' వంటి తప్పుడు ప్రభావాలు ఎన్ని వుంటే అంతలాభం గవర్నమెంటుకి.... ఎలాగంటావా? విద్యార్థుల్లో తప్పుడు ప్రభావాలవల్ల చీలికలు ఏర్పడతాయి. అందువల్ల తమసమస్యల్ని పరిష్కరించు కోడానికి-ఐక్యమవరు. అందుకే ఎంత ఎక్కువగా వీలయితే అంత ఎక్కువగా తప్పుడు ప్రభావాల్ని విద్యార్థులపై కొనసాగేట్టు చూస్తుంది ప్రభుత్వం." అంటూ చిన్న లెక్చరిచ్చేడు.

అంతేకాదు—— 'రాగ్' చెయ్యడం వల్ల జూనియర్లకీ, సీనియర్లకీ స్నేహ సహకార భావాలు పెంపొందుతాయి అన్నది తప్పనీ, 'రాగింగ్' ద్వారా స్నేహ సంబంధం ఒక బలవంతుడికీ, బలహీనుడికీ మధ్య నుండే సంబంధాల్లా ఉంటాయనీ అన్నాడు. అన్నీ సబబనిపించేయి పద్మనాభంకి.

నిజం తెలుసుకున్నప్పటినించీ రాగింగ్ చేయడం మానుకున్నాడు. తన మిత్రులకీ "రాగింగ్" నించి వచ్చే అనర్థాలు తెలియ చెప్పబోయాడు, కానీ-ఫలితం శూన్యం. పైగా ఎగతాళి కూడా చేసేరు.

"అబ్బాయ్! మురళీ నువ్వెళ్ళిపో వాళ్ళతోనేంగాని" పద్మనాభం అన్నాడు అక్కడికీ....

"నువ్వు నోర్ముయ్యరా!" అంటూ మీసాలబ్బాయి పక్కకి తోసాడు పద్మనాభాన్ని.

ఇంతలో "పద్మా" అంటూ కొద్ది దూరంలో వెడుతోన్న మిత్ర బృందం పిలవడంతో- "విడిచి పెట్టండ్రా మీరు మరీను.... నువ్వేం బయపడకు మురళీ, వీళ్ళేం చెయ్యర్లే" అంటూ వెళ్ళి పోయేడు పద్మనాభం.

మురళి యింకా అలాగే నిలబడే ఉన్నాడు.

"ఏమిటలా ఒంటి కాలిమీద భారం వేసి నిలబడ్డావు....? స్ట్రెయిట్‌గా నిలబడలేవూ? ఆ వయసుకే అంత స్టైయిలైతే ఎలా——?" వ్యంగంగా అన్నాడు మీసాలబ్బాయి.

వీళ్ళతో ఎక్కడొచ్చిన గొడవ అనుకుని స్ట్రెయిట్‌గా నిలబడ్డాడు మురళి.

"ఏమిటీ? మరీ, రొమ్ము విరుచుకు నిలబడ్డావు.... ఇప్పుడే రొమ్ము విరుచుకోకండి మురళిగారూ- కాస్త తగ్గాలి తమరు" వెటకారంగా అన్నాడు ఎర్ర చారల చొక్కా.

ఎలా నిలబడాలో తెలీక తికమక పడ్డాడు మురళి.

"ఒరే రామూ! మనోడికి మనసత్తా తెలీనట్టుంది. పడదామా ఓ పట్టూ" అంటూ కళ్ళద్దాలవాడు మురళి భుజంపై చేయి వేసేడు.

"మర్యాదగా ముందు చేయి తీయండి", అంటూ కళ్ళెర్రజేసి

యూ బ్లడి బాస్టర్.... వాడ్యూయాథింక్ అబౌట్ అజ్" అంటూ కళ్ళద్దాలవాడు తన కుడికాలితో మురళి ఎడంకాలుని బలంగా లాగాడు. దబాల్న కింద పడ్డాడు మురళి. చేతిలో ఉన్న పుస్తకాలు కొంచెం దూరంలో పడ్డాయి, చెల్లా చెదురుగా. పగలబడి నవ్వేరు మిత్ర బృందం.

అంతలో వాళ్ళ ప్రొఫెసర్ కాలేజి వేపునించి వస్తూండడం గమనించి నట్టున్నారు ...

"ఉరేయ్! ప్రొఫెసర్ వస్తున్నాడ్రా వెళ్దాం పదండి-వీడి సంగతిప్పుడు గాదు. రాత్రికి చూసుకుందాం గాని.... వెళ్దాం పదండి" అనేసి వెళ్ళి పోయేరంతా.

మురళికి ఎక్కడ లేని ఏడుపూ, కోపం వచ్చేయి. కళ్ళు తిరిగాయి. దూరంగా కొందరు విద్యార్థులు తననిచూసి నవ్వుతున్నారు.

పుస్తకాల్ని తీసుకుని పేంటు దులుపుకుని కాలేజి వేపు నడిచాడు మురళి.

పది నిమిషాల కిదంట వున్న ఆనందం, ఆహ్లాదం, ఉత్సాహం యిప్పుడు మచ్చుకైనా లేవు మురళిలో. 'రాగింగ్' అంటే విన్నాడుగాని ఇలా వుంటుందని ఊహించ లేక పోయేడు మురళి.

* * *

రాత్రయింది.... ఇంజినీరింగ్ కాలేజి గోపుర గడియారం ఏడున్నర గంటలు చూపిస్తోంది.

మురళి భోజనానికని "మెస్"కు వెడుతున్న వాడల్లా ఠక్కున ఆగిపోయాడు. గుండెలు కొంచెం ఆగి వేగం పుంజుకున్నాయి— ఎదురుగా వస్తోన్న ఎర్ర చారల చొక్కా అండ్ కోని చూసి.

మధ్యాహ్నం తనని "రాగ్" చేసిన నలుగురేకాక ఇంకా ముగ్గురు ఎక్కువ ఉన్నారు. వాళ్ళల్లో పద్మనాభం లేడు. అతడుంటే కొంచెం ధైర్యంగా వుండేదే మురళికి.

ధైర్యం కూడగట్టుకుని వాళ్ళని చూడనట్టు తలవంచుకుని వెళ్ళబోయాడు మురళి- కానీ కాలరు పట్టి అతి సులువుగా నిలేశాడు 'కళ్ళజోడు' వాడు.

"మా రూం కొస్తావా?" ఎర్రచారల చొక్కా అడిగింది. మృదువుగా వుంది, అడిగే తీరు.

"ఊఁ రాను" ఖచ్చితంగా చెప్పాడు మురళి.

"ఏం???"

"ఇష్టం లేదు."

"ఇష్టం లేదామ్మా.... శ్రీశ్రీశ్రీమురళి రాజావారు మారూంకొచ్చి మమ్మల్ని తరింప జేయాలి. లేకపోతే, మాకు పొద్దు పోయేదెలా? అంటూ హాస్య మాడుతూనే "ఊఁపదా!" అని కొంచెం కఠినంగానే అన్నాడు ఎర్రచారల చొక్కా.

"సార్.... నాకు ఆకలిగా వుంది సార్..... మెస్ నించి వచ్చాక మీ రెక్కడికి రమ్మంటే అక్కడికొస్తా" బతిమాలుతున్న ధోరణిలో అన్నాడు మురళి.

"మాకు మాత్రం ఆకలిగా లేదా! మురళిగారు!" వెటకారంగా అన్నాడు చిలకముక్కువాడు.

"ఐదు నిమిషాల్లో వద్దువుగాని. అందరంఒక్కసారే భోంచేద్దాంరా."

"ఒరేయ్ పద్మనాభంగాడు రూంలో వుంటాడు నా రూంకు తీసుకుపోదాం.... వాడుంటే మనకు తలనొప్పి" సలహా యిచ్చాడు చిలక ముక్కు, అందరూ వొప్పుకున్నారు.

మిగిలిన ఆరుగురూ నవ్వాపుకుంటూ వెంట నడిచారు. వారి మధ్య నడుస్తున్న మురళి కసాయి వాళ్ళ మధ్య గొర్రె పిల్లలా వున్నాడు. చిలక ముక్కు రూముకు తీసుకొచ్చేరు....

"ఇప్పుడు చెప్పు నాయనా.... ఏమిటీ మధ్యాన్నం అంత తల బిరుసుగా మాట్లాడావు?"

"నీలా తలబిరుసుగా మాట్లాడిన వాళ్ళని ఈ నాలుగేళ్ళలో ఇందర్ని చూశాం" తన తలవెంట్రుకల్ని చూపిస్తూ అన్నాడు కళ్ళజోడు.

"ఈ సంవత్సరం మొదటి సారిగా నువ్వు దొరికావు నీలా తల తిక్కగా వాగే వాళ్ళని లొంగ దీయాలంటే మాకు మహా సరదా...."

"చూడు బాబూ! నీ చొక్కా విప్పుతావా?"

"ఎందుకూ....?"

"'ఎందుకు' కాదు 'ఎందుకు సార్' అనాలి మధ్యాన్నం చెప్పింది గుర్తు లేదా? ఊఁ....అలా అనూ గద్దించేడు కళ్ళజోడు."

"ఎందుకు....సార్....?"

"మేం చెప్పాం.... విప్పాలి.... అంతే 'ఎందుకు' అని ప్రశ్నించే హక్కు నీకు లేదు."

చొక్కా విప్పాడు మురళి....

"పేంటు విప్పు"

"ఊఁ....విప్పు!!!"

విప్పబోయాడు మురళి.

"ఆఁ. సీనియర్సు ముందు పేంటు విప్పుతావా?"

ఊరుకున్నాడు అనుమానంగా చూస్తూ.

"ఏం సిగ్గా....? ఇంతే చాలనుకున్నావా? విప్పు" కళ్ళజోడువాడు ఆజ్ఞ జారీ చేశాడు.

పేంటు విప్పాడు మురళి.

వొత్తి బనియన్ అండర్‌తో నిలబడ్డాడు మురళి. మిగిలిన వాటినీ విప్పించేసేరు మిగిలిన ప్రబుద్ధులు.

సిగ్గుతో తలొంచుకుని నిలబడ్డాడు మురళి.

అందరూ పడీపడి నవ్వుతున్నారు. ఏవేవో బూతులు మాటాడుతున్నారు.

బట్టలు విప్పించి నిలబెట్టే సంస్కారం ఎక్కడి నుంచి వచ్చింది వీళ్ళకి! ఇంతింత చదువులు చదువుతూ ఉన్నా వీళ్ళ నోటివెంట అంతంత పచ్చి బూతులు వస్తోంటే చెప్పలేనంత అసహ్యమేస్తోంది మురళికి.

"ఇదిగో ఎప్పుడైనా దండాలు తీసావా?"

"లేదు....సార్" - అన్నాడేకాని కాలేజిలో చేరక ముందు వ్యాయామంలో ఓ భాగంగా దండాలు తీసేవాడు మురళి.

"తెలుసు" అంటే యింకా ఏమైనా చేయమంటారని తెలియదన్నాడు తను.

"ఏం పర్వాలేదు మా అంజిగాడు చేసి చూపుతాడు అలాచేయ్!" అన్నాడు చిలకముక్కు.

అంజిగాడు దండాలు తీసి చూపాడు. అలా చేయడానికి ఉపక్ర మించేడు మురళి.

విరగబడి నవ్వు తున్నారు.

సిగ్గూ, రోషమూ కళ్ళల్లో నీరయ్యాయి మురళికి.

"ఆపాపు.... నవ్వలేక చస్తున్నాంబాబు" అన్నాడొకడు పొట్టచేత పట్టుకుని నవ్వుతూ.

"ఇంక....చాలా సార్" ఎంతో దీనంగా అన్నాడు.

"అప్పుడే? నీతో ఎంత పనుందీ, ఏంకత"

"సార్. ఆకలవుతోంది"

"వీల్లేదు....ముందు ఏర్ చెయిర్ వెయ్యి."

"ఎలా వెయ్యడం?"

"తెలిదూ....ఇలా" అంటూ చూపించేడు మీసాలవాడు గాలిలో కుర్చీలో కూచున్న పోజుపెట్టి.

'ఏర్ చెయిర్' వేసేడు మురళి....

వెనకాల నుంచీ మురళి పిరుదుల మీద తన్నాడు మీసాలవాడు. ఎదురుగావున్న ఎరుపు చారలచొక్కా వాడిమీద పడ్డాడు; ఎరుపుచారల చొక్కావాడు బలంగా పొట్టమీద పిడికిలితో ఓ గుద్దువేసి కుడి వేపున వున్న కళ్ళద్దాలవాడి మీద వెల్లకిలా పడేట్టు తోసేశాడు. కళ్ళజోడువాడు మురళి మెడమీద ఇంకాగట్టిగా గుద్దువేసి తనకు ఎదురుగావున్న చిలక ముక్కువాడి మీదకు తోశాడు.... చిలక ముక్కువాడు అక్కడినించి వెంటనే తప్పు కున్నాడు. అంతే.... గోడని రపీమని ముద్దుపెట్టు కున్నాడు మురళి. పై పెదవి కుడివేపున చిట్లి రక్తం కారడం మొదలు పెట్టింది. తడిమి చూసుకున్నాడు. వేళ్ళు రక్తాన్ని చూపించేయి.

ఘొల్లుమని నవ్వులు ప్రతి ధ్వనిస్తోన్నాయి ఆ గదిలో.

"ఇటు తిరుగు" అన్నాడు ఎర్రచారల చొక్కా.

రక్తం ధారగా కింది పెదవిని దాటింది. గాయం తగిలి పెదవి అదురుతోంది. పై పెదవి మీద వత్తుకుంటూ ఎదురుగా నిస్సహాయంగా చూశాడు మురళి. మురళి అలా పెదవి వత్తుకోవడంతో— "రాస్కెల్, మామీద మీసాల్ దువ్వుతావా?" అంటూ ఫెడీమని చెంపమీద శక్తికొద్దీ దెబ్బవేశాడు కళ్ళజోడు.

ఎడంచేయి చెంపమీద నిమురుతూ ఉంచుకున్నాడు. ఏడుపు కట్టలు తెంచుకుని వచ్చింది మురళికి.

"ప్లీజ్.... మీకు పుణ్యముంటుంది వదలండి సార్!" అంటూ గట్టిగా ఏడ్చేశాడు మురళి.

"ఒరేయ్! ఆడదాన్లా ఏడుస్తున్నాడు చూడరా.... వీడూ బిటెక్ చదివి ఇంజినీరవుతాట్ట."

"నువ్వు మధ్యాన్నం చూపిన తలబిరుసు పర్యవసానం ఎంత ఘోరంగా ఉందో చూశావా? అప్పుడే ఏమయింది.... ఇంకా ఎన్నవస్తలు పెట్టాలో ఏమో? నిన్నిలాగే పట్టపగలు బేర్‌బాడీతో కాలేజి కాంపౌండు చుట్టూ రౌండ్సు కొట్టిస్తాం తెలిసిందా?"

"మధ్యాన్నం నేను అలా ప్రవర్తించి నందుకు క్షమించండి సార్!" వినయతతో వేడుకున్నాడు మురళి.

"నీ తలపొగరు అంత తొందరగా తగ్గిందంటావా? బేర్‌బాడీతో ఉన్నందుకు అంత తగ్గావుకానీ లేకుంటే.... అమ్మమ్మ నీకు చెప్పలేనంత గర్వముంది."

రాత్రి పన్నెండు గంటలు కావస్తోంది. మురళి బతిమాలుతూనే ఉన్నాడు. ఓ సినిమా పత్రిక తెరిచి అందులో అర్ధ నగ్నంగా ఉన్న బొమ్మను కౌగిలించుకో మన్నారు, ముద్దులాడమన్నారు.... చెప్పిందల్లా చేసేడు.

"రేప్పొద్దునే రా-కాలేజి కాంపౌండు చుట్టూ.... ఏం చేయాలో అంతకు మునుపు చెప్పాం జ్ఞాపకముందా? ఊఁ- అలా చేయాలి." అంటూ వదిలేశారు.

బట్టలేసుకుని బ్రతుకు జీవుడా అని బయట పడ్డాడు.

మెస్ టైం ఎప్పుడో దాటిపోయింది.

మురళి ఆకలి ఎప్పుడో చచ్చిపోయింది.

తన రూం కొచ్చాడే కాని నిద్ర రాలేదు.....

అంతవరకూ తనకి జరిగిన 'రాగింగ్'ని గురించిన ఆలోచనల్తో తల వేడెక్కి పోతోంది. ఒక్కరా? ఇద్దరా? ఏడుమంది ముందు తను దిగంబరిగా వాళ్ళు చేయమన్న అసహ్యమైన పనులన్నీ చేశాడు.... ఆ సమయంలో తన చేతిలో పిస్టలుంటే ఒక్కొక్కడి గుండెల్లో నిర్దాక్షిణ్యంగా పేల్చేసి ఉండును.

ఈ రోజు చేసిన రాగింగ్ ఘోరమయిందనుకుంటే రేపు ఇంతకంటే దారుణం! బేర్‌బాడీతో కాలేజీ చుట్టూ రౌండ్లు వేయిస్తార్ట....అదీ పట్టపగలు అంత మంది స్టూడెంట్సు మధ్య.

పోనీ....చదువు మానుకుంటేనో!

తను ఏ మొహం పెట్టుకుని ఇంటికెళ్తాడు?

తన నాన్నకి ఏమని సంజాయిషీ చెప్పుకుంటాడు?

మురళీకేం పాలు పోవడం లేదు.

వీళ్ళు అన్నంత పనీ చేస్తారు. వీళ్ళలో దయాదాక్షిణ్యాలు లేవన్నది అరగంట క్రితమే రుజువయింది.

మర యితే....

ఎలా?— ఎలా??— ఎలా???

* * *

మరసట్రోజు....

మధ్యాహ్నం అందరూ భోజనానికి మెస్‌కు వెళ్ళేందుకు సిద్ధమౌతున్నారు. పద్మనాభం వొగరుస్తూవచ్చేడు.

"ఏమైందిరా? ఏమైంది? అలా వొగురుస్తూ వచ్చావు?" అడిగాడు కళ్ళజోడు వాడు.

'ఒరేయ్!.... ఆ కొత్తబ్బాయి లేడూ.... అదే. నిన్న మధ్యాన్నం మీరు రాగింగ్ చేశారు చూడూ..." వొగరుస్తూ గట్టిగా వూపిరి తీసుకోడానికని ఆగాడు.

"ఆఁ.... మురళీనా...."

"ఆఁ. ఆఁ. మురళీనే రైలుకింద ఆత్మహత్య చేసుకున్నాడ్రా.... రాత్రి మీరు మళ్ళీ రాగింగ్ చేశారటగా.... బట్టలు విప్పించేసి, సూరీ చెప్పాడు."

ఆఁ.... అ-వు-ను.... ఏం???" మీసాలవాడు.

"మీకు బుద్ధుందా? మీరు మనుషులా? రాక్షసులా? మీకు ఎంత చెప్పినా బుద్ధి రాదురా! మీ చేష్టలతో నిండు ప్రాణాన్ని బలిగొన్నారు ... ఇప్పటికైనా తెల్సిందా మీకు, మీరు ఏ సం స్కృ తి లో కొట్టుకు పోతున్నారో!!...."

ఆవేశంతో పద్మనాభం మాటాడుతోంటే-

మిత్ర బృందం నోరు తెరిచి వింటోంది.

( ప్రజాసాహితి డిసెంబరు - 1979. )